

వట్‌పల్లి : ఇంటింటా ప్రచారం పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి క్రాంతి కిరణ్

## కాంగ్రెస్ హయాంలో
# అభివృద్ధి శూన్యం

- పదవుల కుమ్ములాట తప్ప ప్రజా సంక్షేమంపై పట్టింపు లేదు..
- అందోల్ ఎమ్మెల్యే అభ్యర్థి క్రాంతి కిరణ్

వట్‌పల్లి, నవంబర్ 2 : కాంగ్రెసోల్లకు పదవుల కుమ్ములాట తప్ప ప్రజలపై పట్టింపు లేదని 60 ఏండ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రానికి చేసిందేమీ లేదని కాంగ్రెస్‌కు ఓటు వేస్తే రాష్ట్రం అదోగతి పాలు అవుతుందని అందోల్ ఎమ్మెల్యే అభ్యర్థి చంటి క్రాంతి కిరణ్ విమర్శించారు. గురువారం మండలంలోని గౌరైకల్, వట్‌పల్లి, దేవునూర్, గట్‌పల్లి(షాద్‌నగర్) గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు క్షేత్ర స్థాయిలో ప్రజలకు చేరాలన్నదే కేసీఆర్ లక్ష్యమన్నారు. అందోల్‌లో పరిస్థితి చూస్తుంటే కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ దక్కదన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో ప్రతి పైసా పేదోళ్లకు ఏదో సంక్షేమం రూపంలో చేరిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వాళ్లకు వాళ్లే కొట్టుకోవడమే సరిపోతుందని అరోపించారు. రాష్ట్రాన్ని దోచుకోవడానికి కాంగ్రెస్ మరోసారి అధికారం కావాలంటుందన్నారు. అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ నాయకులు విమర్శలు తగవని మీ హయాంలో జరిగిన అభివృద్ధికి.. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి లెక్కలు ఉన్నాయన్నారు. ప్రజలే మీకు సరియైన సమాధానం ఇచ్చి తగిన గణపాఠం చేప్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ఇన్‌చార్జి ఫరూఖ్ హుస్సేన్, ఎంపీపీ కృష్ణవేణి, వరం అధ్యక్షుడు వీరారెడ్డి, రైతు బంధు అధ్యక్షుడు అశోక్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శివాజీవావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురేఖాబుద్ధిరెడ్డి, సర్పంచ్‌లు నవనీత సుభాష్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



# మీబిడ్డను ఆదరించండి

స్థానికుడిని.. సేవ చేసుకునే భాగ్యం కల్పించండి

### జహీరాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కొనింటి మాణిక్‌రావు

జహీరాబాద్, అక్టోబర్ 2 : బీఆర్ఎస్ అన్ని వర్గాల సంక్షేమం కోసం ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల చేసిందని, ఎన్నికల్లో ఓట్లు వేసి ఆశీర్వదించాలని జహీరాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కొనింటి మాణిక్‌రావు తెలిపారు. గురువారం జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్‌లోని (8,9,10,11) వార్డులో రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవిప్రసాద్‌రావు,టీఎస్ఐడీసీ చైర్మన్ తన్వీర్, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మాల్కాపూరం శివకుమార్‌లతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమం కోసం మ్యానిఫెస్టో విడుదల చేశారన్నారు. మహిళా సంఘాలకు సొంత భవనాలు నిర్మాణలు చేసేందుకు బీఆర్ఎస్ కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గ కేంద్రంలో అగ్ర వర్ణ పేద విద్యార్థుల కోసం గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తుందన్నారు. అసైన్డ్ భూములపై పట్టాదారులకు పూర్తి హక్కులు కలిపిస్తామన్నారు. మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో పథకాలు ఏర్పాటు చేసిందన్నారు.

**ఓట్లు వేసి ఆశీర్వదించండి**

మీ బిడ్డను ఓట్లు వేసి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు కోరారు. శాంతినగర్‌లోని పలు కాలనీ లో ఇంటింటా ప్రచారం చేశారు. ఎప్పుడు అందుబాటులో ఉండి సేవ చేస్తా.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి స్థానికేతర వ్యక్తి ఎన్నికల్లో ఓటమి చెందిన వెంటనే ఇక్కడ ఉండరు.. నేనూ ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తా అన్నారు. శాంతినగర్‌లోని పలు కాలనీలో మహిళలు మంగళహారతితో ఎమ్మెల్యే మాణిక్‌రావుకు స్వాగతం పలికారు. కొందరు మహిళలు ఎమ్మెల్యే మాణిక్‌రావును ఘనంగా సన్మానం చేసి ఓట్లు మీకు వేస్తామని హామీ ఇచ్చారు. ప్రచారంలో రైల్వే బోర్డు సభ్యుడు షేక్ ఫరీద్, ఆత్మ కమిటీ చైర్మన్ పెంటారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జి. గుండప్ప, పట్టణాధ్యక్షుడు సయ్యద్ మొహినొద్దీన్, పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నామినేషన్ ప్రక్రియ
# సజావుగా జరగాలి

- నేటినుంచే నామినేషన్ల స్వీకరణ
- అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి
- పక్కాగా ఎన్నికల నియమావళి అమలు
- 1950 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదులు చేయాలి
- ఈనెల 20లోగా ఓటర్ స్లిప్‌ల పంపిణీ పూర్తి కావాలి
- వీడియోకాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి ఎన్నికల అధికారి శరత్




వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 2: నామినేషన్ల ప్రక్రియ జిల్లాలో సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీడియోకాన్ఫరెన్స్ హాల్ నుంచి రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, డీఎస్పీలు, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ బృందాలకు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి ప్రారంభం కానున్న నామినేషన్ల ప్రక్రియకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. రిటర్నింగ్ అధికారులు పాటించాల్సిన నియమ నిబంధనలను వివరించారు. శుక్రవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను సమర్పించవచ్చని తెలిపారు. నామినేషన్ పేపర్లతో పాటు డాక్యుమెంట్లను కూడా పరిశీలించాలన్నారు. ఒక అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్ దాఖలు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థిని ప్రతిపాదించే వ్యక్తి అదే నియోజకవర్గానికి చెందిన వారై ఉండాలని, జాతీయ లేదా రాష్ట్ర గుర్తింపు పొందిన పార్టీ తరపున పోటీ చేసేవారు నామినేషన్ వేస్తే వారిని ఒకరు ప్రతిపాదిస్తే సరిపోతుందని, రిజిస్టర్డ్ గుర్తింపు లేని స్వతంత్ర అభ్యర్థి అయితే 10 మంది ప్రతిపాదించాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ సమర్పించే సమయంలో అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే కార్యాలయంలో అనుమతి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. ర్యాలీలు, సభలు, సమావేశాలు, లౌడ్ స్పీకర్లు తదితరాలకు సంబంధించి ప్రాపర్‌గా అనుమతులు ఇవ్వాలన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, ఎస్ఎస్‌టీ బృందాలు సరిగ్గా పని చేయాలన్నారు. అన్ని వేళలా అప్రమత్తంగా ఉండాలన్నారు. చెక్ పోస్టులను పోలీసు అధికారుల సమన్వయంతో సందర్శించాలన్నారు. స్వీప్ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని, ఓటర్లు 100 శాతం ఓటు హక్కు వినియోగించుకోవాలని, పారదర్శక ఎన్నికల నిర్వహణకు సహకరించాలని అవగాహన పెంపొందించారు. ఈ నెల 20లోగా ఓటర్ స్లిప్‌ల పంపిణీ పూర్తి కావాలన్నారు. నామినేషన్లు వేసిన నాటి నుంచే అభ్యర్థుల ఎన్నికల ఖర్చు లెక్కించబడుతుందన్నారు. సీ విజిల్ యాప్ ప్రాపర్‌గా నిర్వహించాలన్నారు. సీ విజిల్ యాప్‌పై ప్రజలలో అవగాహన పెంచాలన్నారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో ఎస్పీ రూపేశ్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో నగేశ్, నోడ ల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, డీఎస్పీలు, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ బృందాలు, వ్యయ పరిశీలకులు పాల్గొన్నారు.

# కదిలిన గులాబీదండు

- భారీ మెజార్టీతో బీఆర్ఎస్ గెలుపు ఖాయం
- ఎమ్మెల్యే మదన్‌రెడ్డి
- అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట
- నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి


కొల్చారం, నవంబర్ 2 : కొల్చారం మండలంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు.. ఊరూరా డప్పుచప్పుళ్ల మధ్య నృత్యా చేస్తూ ఘన స్వాగతం పలికారు. మండలంలోని కొంగోడు, నాయిన్‌జలాల్‌పూర్, పోతిరెడ్డిపల్లి, అంసాన్‌పల్లి, వసురాంతండా, వెంకటాపూర్, పోతంశెట్‌పల్లి, అప్పాజిపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి గురువారం ఎన్నికల ప్రచా రం నిర్వహించారు.

**రాష్టంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు**

రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతున్నదని బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి అన్నారు. గతంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా మండలంలో ప్రజలకు సంబంధించిన సమస్యలు తీర్చడానికి కృషి చేశా. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు వేసుకున్నాం. డంపింగ్‌యార్డులు నిర్మించుకున్నాం. వైకుంఠధామాలు కట్టుకున్నాం. 24 గంట లు ఉచిత కరెంట్, రైతుబంధు, రైతు కుటుంబాలను ఆదుకునేందుకు రైతు బీమా వంటి పథకాలు అమలు జరుగుతున్నాయి. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలన్నారు.

**మెజార్టీ ఎంతన్నదే లెక్క : ఎమ్మెల్యే**

పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ పథకాలు మరే రాష్ట్రంలో లేవు. కేసీఆర్ మూడోసారి సీఎం గా హ్యాట్రిక్ కొట్టడం ఖాయం. నర్సాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు పక్కా అని.. మెజార్టీ ఎంతన్నదే లెక్క తేలాల్సి ఉందన్నారు. ఈ ప్రచారంలో మండలాధ్యక్షుడు గౌరీశంకర్ గుప్తా, జడ్పీటీసీ మేఘమాల, ఎంపీపీ మంజుల, వైస్ ఎంపీపీ అల్లు మల్లారెడ్డి, సర్పంచ్‌లు,ఎంపీటీసీలు , నాయకులు పాల్గొన్నారు.



కొల్చారం మండలంలో నిర్వహించిన ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి,బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి